సాక్షి నిజామాబాద్

శనివారం । 31 । ఆగస్టు । 2024



మెరుగైన విద్య అందించాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు.

- 8లో ▸



మొరాయిస్తున్న తూము

మోర్తాడ్‌లోని ముసలమ్మ చెరువు తూము గేట్ మొరాయిస్తుండటంతో ఆయకట్టు పంటలకు నీరు అందడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /22.5

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నరేందర్‌ను కోర్టులో హాజరుపర్చిన ఏసీబీ

ఖలీల్‌వాడి: మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి నరేందర్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం సాయంత్రం నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. ఏసీబీ అధికారులు నరేందర్ ఇంట్లో రూ.2.93 కోట్ల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. మూడు రోజుల కస్టడీ ముగియడంతో కోర్టులో హాజరు పరిచారు.

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): వికలాంగత్వ నిర్ధారణ కోసం జిల్లాలో సెప్టెంబర్ నెలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 4, 11, 18 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 31న (శనివారం) 11:30గంటలకు మీ సేవా కేంద్రాల్లో సదరం స్లాట్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత తేదీల్లో మీ సేవ రసీదుతో పాటు మెడికల్ రిపోర్టులు, ఆధార్, ఇతర పత్రాలను వెంట తీసుకుని శిబిరానికి హాజరు కావాలన్నారు.

ఇంటర్‌లో 'డిలిట్' ఆప్షన్‌కు నేడే ఆఖరు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇతర కాలేజీల్లో చేరడానికి డిలిట్ ఆప్షన్ శనివారం (ఆగస్టు 31) వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని డీఐఈవో రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాల్‌లు తమ కళాశాలల్లో చేరిన విద్యార్థులు ఇతర కళాశాలలో చేరుతామంటే అడ్మిషన్ డిలిట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమకు ఇష్టమైన కళాశాలలో, గ్రూపులోకి చేరడానికి అవకాశం కల్పించాలన్నారు. ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు సెప్టెంబర్ 7 వరకు గడువు ఉందన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి



బాల్కొండ: ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్లు శ్రీధర్, శ్రీకాంత్, ఎంపీడీవోలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ముజాప రొద్దీన్, ఎంపీవోలు గంగామోహన్, గౌస్‌మోహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేను రౌడీ ఎమ్మెల్యేను..

- అవినీతికి పాల్పడితే ఊరుకోను
- ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌పై ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆగ్రహం



ఆర్మూర్: 'నేను రౌడీ ఎమ్మెల్యేను.. అధికారులు అవినీతికి పాల్పడితే ఊరుకోను' అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నా రు. అవినీతికి పాల్పడొద్దని పలుమార్లు సూచించినా అధికారుల్లో మార్పు రావడం లేదని, ఇకపై మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే ఊరుకొనేది లేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అదే సమయంలో వినాయక విగ్రహాల తయారీదారులు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని కలిసి మున్సిపల్ అధికారులు షెడ్డుకు, వినాయక విగ్రహాల తయారీ పర్మిషన్ల కోసం డబ్బులు అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. ఒక్కో గుడిసెకు తైబజార్ రూ.4వేలు చెల్లించినా మున్సిపల్ అధికారులు రూ.30 వేలు కట్టాలని నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను రౌడీ ఎమ్మెల్యేనని ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాజును హెచ్చరించారు. వినాయక విగ్రహాల తయారీకి ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులపై కమిషనర్ రాజును ఆరా తీశారు.



కనుచూపు మేర

జిల్లాలోని మంచిప్ప నుంచి కామారెడ్డి జిల్లా గాంధారికి వెళ్లే మార్గంలో గల గుట్టల్లో సాగవుతున్న పంటలు కనుచూపు మేర పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. కొండలు, గుట్టలు నమ్ముకొని గిరిజనులు వ్యవసాయం చేస్తున్నారు. యాచారం తండా వద్ద సాగవుతున్న మొక్కజొన్న, పత్తి పంటలను 'సాక్షి' క్లిక్ మనిపించింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సగంలో వదిలేశారు

నగరానికి రూ.వంద కోట్ల నిధులు మంజూరు అవడంతో అభివృద్ధి జరుగుతుందని ఆశించిన నగరవాసులకు నిరాశే మిగిలింది. గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన పనులు ప్రస్తుతం ముందుకు సాగడం లేదు. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మరోవైపు ఆయా డివిజన్లలో ఎల్‌ఈడీ లైట్లు వెలగడం లేదు. ఆయా పనులను మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

- నగరంలో రూ.వంద కోట్లతో గతేడాది అభివృద్ధి పనులు ప్రారంభం
- ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన వైనం
- మరోవైపు నగరంలో చాలాచోట్ల వెలగని ఎల్‌ఈడీ లైట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- ఇదీ నిజామాబాద్ నగర పాలక సంస్థలో తీరు



ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో అధ్వానంగా ఉన్న రోడ్డు



పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పన్నులు వసూలు చేయడం .. టౌన్ ప్లానింగ్ అనుమతుల విషయంలో ప్రభుత్వ ఫీజులకు గండికొట్టి అందినకాడికి దండుకునేలా వ్యవహరిస్తున్న నిజామాబాద్ నగరపాలక అధికారులు.. అభివృద్ధి పనుల విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదు. నగరంలో అసంపూర్తిగా ఉన్న రూ.100 కోట్ల పనుల విషయంలో ప్రభుత్వానికి నివేదించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా కేసీఆర్ ప్రభుత్వం నిజామాబాద్ నగరపాలక సంస్థకు రూ.100 కోట్ల అభివృద్ధి నిధులను కేటాయించింది. ఈ నిధులతో అన్ని డివిజన్ల పరిధిలో అవసరమైన వివిధ అభివృద్ధి పనుల కోసం.. ఒక్కో డివిజన్‌కు రూ.కోటి చొప్పున 60 డివిజన్లకు రూ.60 కోట్లు కేటాయించారు. మిగిలిన రూ.40 కోట్లను నగరంలో వివిధ చౌరస్తాలు, ప్రధాన రోడ్ల అభివృద్ధికి కేటాయించారు. ఇందుకు సంబంధించి 2023 మార్చి, ఏప్రిల్, జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అప్పటి ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా సదరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. దాదాపు అన్ని చోట్లా పనులు ప్రారంభించారు. సుమారు రూ.2.30 కోట్ల మేర పనులు అయ్యాయి. ప్రభుత్వం మారిన తరువాత బిల్లులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు ఆయా పనులను నిలిపేశారు. కొత్త ప్రభుత్వం సదరు పనులకు సంబంధించి నిధులను విడుదల చేసే విషయమై పట్టించుకోవడం లేదు. ఆయా పనుల ఆవశ్యకతపై ప్రభుత్వానికి నివేదించే విషయంలో నగరపాలక కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

మరమ్మతులు కరువు

నగరంలోని 60 డివిజన్ల పరిధిలో ఎక్కడ కూడా ఎల్‌ఈడీ లైట్లు వెలగడం లేదు. అన్ని చోట్లా వాటికి రిపేర్లు చేయాల్సి ఉన్నప్పటికీ చేయడం లేదు. కొత్త బల్బులు సైతం ఏర్పాటు చేయడం లేదు. బిల్లులు ఇవ్వకపోవడంతో సరఫరాదారు సైతం బల్బులు ఇవ్వడం లేదు. నగర వ్యాప్తంగా సుమారు 2,400 ఎల్‌ఈడీ బల్బులు వెలగడం లేదు. వీటి విషయమై కమిషనర్ ఇతర అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారుల సంగతి ఇలా ఉంటే సీడీఎంఏ అధికారులు సైతం దృష్టి సారించకపోవడం గమనార్హం. దీంతో నగరంలో రాత్రి సమయంలో ఎక్కడ చూసినా చీకటే రాజ్యమేలుతోంది.

అభివృద్ధి కుంటుపడుతోంది



రెండేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనులు నిలిచిపోయాయి. దీంతో నగరంలో అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రభుత్వం మారిన తర్వాత నిధులను నిలిపేయడం సరికాదు. ఈ విషయమై అధికారులు సైతం స్పందించడం లేదు. నిధులు నిలిపేసిన విషయమై కౌన్సిల్‌లో చర్చ సైతం జరిగింది. అయినప్పటికీ పట్టించుకోకపోవడం శోచనీయం. తక్షణమే నిధులు విడుదల చేసి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాలి.

– న్యాలం రాజు, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్

కదిలిన యంత్రాంగం

- నగరంలో తనిఖీలు చేపట్టిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సాక్షి ఎఫెక్ట్..



సీతారాంనగర్ హెల్త్ సెంటర్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: నగరంలో డెంగీ కేసుల విజృంభిస్తున్నాయని 'సాక్షి' పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మున్సిపల్ కమిషనర్ మకరందు, డీఎంహెచ్‌వో రాజశ్రీ నగరంలో తనిఖీలు చేపట్టారు. డెంగీ కేసులు ఎక్కువగా నమో దు అవుతున్న ప్రాంతాల్లో పర్యటించారు. ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలను కలెక్టర్ పరిశీలించారు. దోమల పెరుగుదల, నివారణ చర్యలపై మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. నగరంలోని సీతారాంనగర్ కాలనీలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. డెంగీ నిర్ధారణకు ర్యాపిడ్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూ చించారు. వైద్య సేవల గురించి రోగులతో మాట్లా డారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాంరాథోడ్, డాక్టర్ అంజన ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ తనిఖీలు

నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మకరందు పర్యటించారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాగారంలోని గోశాల వద్ద డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడం, మార్గమధ్యలో మురికినీరు నిల్వ ఉండడంపై అధికారులతో చర్చించారు. సరైన డ్రెయినేజీ నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కోస్లీ గోదావరి తీరాన గల అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 70 శాతం నీరు నిల్వ ఉందన్నారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్ చోరీ చేస్తుండటంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో అధికారులు, పోలీసులతో పాటు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొన్ని సొసైటీలలో పాలకవర్గాలు, అధికారులు అవకతవకలకు పాల్పడడంతో రుణమాఫీలో కొందరు రైతులకు అన్యాయం జరిగిందన్నారు. తప్పిదాలను సరిచేసి రైతులకు న్యాయం చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు ఆయన మండల కేంద్రంలోని అలీసాగర్ కాలువపై వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇరిగేషన్ ఎస్‌ఈ బద్రినారాయణ, ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ, డీఈఈ బలరామ్, ఎంపీడీవో నాగనాథ్, తహసీల్దార్ నారాయణ, నాయకులు గడుగు గంగాధర్, రామ్మోహన్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిషన్‌రావ్ పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి రోగుల తాకిడి

- శుక్రవారం రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 2,680 ఓపీ నమోదు
- డెంగీ, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ జ్వరాలతో వస్తున్న రోగులు
- ఆస్పత్రిలో ఏర్పడిన మందుల కొరత
- 15 రోజులుగా బీపీ, షుగర్ గోలీలు లేవు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

జీజీహెచ్‌లో జనరిక్ మందుల దుకాణం ఎదుట రోగులు





జీజీహెచ్‌లో ఉచిత మందుల కోసం బారులు తీరిన రోగులు

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి విపరీతంగా పెరిగింది. సాధారణ రోజుల్లో 1200 నుంచి 1600 వరకు ఓపీ నమోదయ్యేది. వారం, పది రోజులుగా రెండు వేలకు పైగా రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. శుక్రవారం రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 2,680 మంది అవుట్ పేషెంట్‌లు నమోదు అయ్యారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల కంటే ఇది అత్యధికం. హైదరాబాద్‌లోని ఉస్మానియాలో 2,566, గాంధీలో 2,192, వరంగల్ ఎంజీఎంలో 2,385 ఓపీ నమోదైంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ఆస్పత్రులకు రోగులు వరుస కడుతున్నారు. ముఖ్యంగా డెంగీ, వైరల్ ఫీవర్, టైఫాయిడ్, చికున్‌గున్య తదితర జ్వరాలతో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. అయితే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సరిపడా మందులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత 15 రోజులుగా బీపీ, షుగర్ మందులు లేవు. దీంతో రోగులు మందులను బయట కొనుగోలు చేస్తున్నారు.

కొరత లేకుండా చూస్తున్నాం

సీజనల్ వ్యాధులతో ఓపీ బాగా పెరిగింది. రోగుల తాకిడి పెరగడంతో మందులు సరిపోవడం లేదు. మందులు లేకపోవడంతో బయట నుంచి కొనుగోలు చేసి తెప్పిస్తున్నాం. సాధ్యమైనంత వరకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని మందులు లేవు. మళ్లీ తెప్పిస్తాం.

– రాజేందర్, జీజీహెచ్ ఏడీ

బయట కొనుక్కోమంటున్నారు



జ్వరం వస్తుందని చూపించుకోవడానికి జీజీహెచ్‌కు వచ్చాను. వైద్యులు చూసి నాలుగు రకాల మందులు రాశారు. ఇందులో రెండు రకాలు ఉన్నాయని ఇచ్చారు. మిగతా మందులు బయట కొనుక్కోమని చెబుతున్నారు.

– బాలాజీమోరే, ఆటోనగర్

మందులు లేవంటున్నారు



వైరల్ ఫీవర్ రావడంతో ఎడపల్లి నుంచి వచ్చి చూపించుకున్నాను. మా వాళ్లకు అవసరం ఉన్నా బీపీ, షుగర్ మందులు ఆస్పత్రిలో లేవు. 15 రోజుల క్రితం వచ్చిన ఇప్పుడు మళ్లీ లేవని చెబుతున్నారు.

– కవిత, ఎడపల్లి

దగ్గు, కంటి మందులు కూడా..



నేను రుద్రూరు మండలం చిక్కడ్‌పల్లి నుంచి వచ్చాను. దగ్గు, కంటి మందులు లేవంటున్నారు. ఎప్పుడు వస్తాయో కూడా చెప్పడం లేదు. వైద్యం మాత్రమే చేస్తున్నారు. మందులు లేకపోతే ఎలా తగ్గుతుంది.

– పద్మ, చిక్కడ్‌పల్లి

చేప పిల్లల కేంద్రం పరిశీలన

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల జాతీయ చేపపిల్లల కేంద్రాన్ని జిల్లా ఏడీ ఆంజనేయులు స్వామి శుక్రవారం పరిశీలించారు. చేప పిల్లల కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి కోసం చేసిన ప్రయోగాలను పరిశీలించారు. కేంద్రంలోని సమస్యలను తెలుసుకున్నారు. అంతకు ముందు మెండోరా మండల కేంద్రంలోని పలు గ్రామాలను మండల ప్రత్యేకాధికారిగా ఆయన సందర్శించారు. సీజల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టవలసిన చర్యల గురించి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వనజ ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 11 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 50, ఆవిరి రూపంలో 594, మిషన్‌ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కులు నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1085.10 (60.11 టీఎంసీలు) అడుగుల నీరు ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

జీతాలు చెల్లించండి



నిజామాబాద్‌అర్బన్‌: తమకు జీతాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్‌కు మిషన్‌ భగీరథలో పనిచేస్తున్న ఆపరేటర్లు తరలివచ్చారు. కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు చెందిన మిషన్‌ భగీరథ ఆపరేటర్లు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసేందుకు రాగా అందుబాటులో లేక పోవడంతో అక్కడే నిరసన చేశారు. అనంతరం జిల్లా నీటిపారుదల శాఖ అధికారులను కలిసి విన్నవించారు.

తెయూ విద్యార్థికి డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి కొడిగంటి శ్రీధర్‌ డాక్టరేట్‌ శుక్రవారం సాధించారు. తెయూ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ వాసం చంద్రశేఖర్‌ పర్యవేక్షణలో 'లైగాండ్‌ ఫెసిలిటేటెడ్‌ అడ్సర్పషన్‌ ఆఫ్‌ హెవీ మెటల్స్‌ ఫ్రమ్‌ ఆక్వాస్‌ మీడియం బై సెలెక్టెడ్‌ మైక్రోటు నానో స్ట్రక్చర్‌ అడ్సర్బంట్‌' అనే అంశంపై శ్రీధర్‌ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. శ్రీధర్‌ను తెయూ అధ్యాపకులు అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ విభాగాధిపతి వాసం చంద్రశేఖర్‌, సైన్స్‌ డీన్‌ సీహెచ్‌ఆరతి, కంట్రోలర్‌ ఎం అరుణ, అధ్యాపకులు బోయపాటి శిరీష, పర్యవేక్షకులు సత్యనారాయణ రెడ్డి, ప్రసన్నశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న తూము గేట్‌..

- పంట పొలాలకు అందని నీరు
- కాంట్రాక్టర్‌, అధికారుల నిర్లక్ష్యంతో రైతుల ఇబ్బందులు



తూము గేటు తెరవడానికి ప్రయత్నిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు (ఫైల్‌)



ముసలమ్మ చెరువు తూము, (ఇన్‌సెట్‌లో) అలుగు వరకు చేరిన నీరు

మోర్తాడ్‌: మోర్తాడ్‌లోని వ్యవసాయ భూములకు సాగునీటిని అందిస్తున్న ముసలమ్మ చెరువులో తూము గేటు తెరుచుకోవడం లేదు. దీంతో పంటలకు నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం చెరువు మరమ్మతులకు రూ.3 కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యంగా మారింది. పంట కాలువకు నీరు అందించే తూము గేటు తెరుచుకోకుండా మొరాయిస్తోంది. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తూముకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు పూర్తిగా నిండింది. అలుగు పైనుంచి నీరు మొండివాగులోకి వెళ్లిపోయింది. ఈ చెరువు కింద దాదాపు వెయ్యి ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. చెరువు నీరు సరఫరా కాకపోవడంతో రైతులు బోరుబావుల నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్‌లు వేసి నీటిని అందించుకుంటూ పంటలను కాపాడుకుంటున్నారు.

చెరువు మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పనులను పర్యవేక్షించాల్సిన నాటి ఇంజినీరింగ్‌ అధికారులు మామూళ్లకు అలవాటు పడి పనుల్లో నాణ్యతను పట్టించుకోలేదు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులో నీరు ఉన్నా పంటలకు అందించని పరిస్థితిని నెలకొంది. చెరువు మరమ్మతులకు మరోసారి నిధులను కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి చెరువు నీటిని పంట పొలాలకు అందించే ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గతంలో ఇష్టారాజ్యంగా పనులు..



ముసలమ్మ చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తే గత ప్రభుత్వ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. చెరువులో నీరు ఉన్నా పంటలకు చుక్కనీరు అందించని పరిస్థితి ఉంది. నాటి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

– జక్కం అశోక్‌, గ్రామ కమిటీ అధ్యక్షుడు

అంచనాలు తయారు చేస్తున్నాం

గతంలో పని చేసిన సమయంలో నిర్లక్ష్యం జరిగింది. గేట్‌ తెరిపించడానికి మరోసారి మరమ్మతులు చేయాల్సి ఉంది. మరమ్మతులకు ఎంత నిధులు అవసరమో అంచనా వేసి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. చెరువు నీటిని పంట పొలాలకు అందించే విషయంలో వేగంగా పని చేస్తున్నాం.

– త్రిశూల్‌, నీటిపారుదల శాఖ జేఈ

పునరుత్పాదక ఇంధన వనరులను కాపాడాలి

- సీనియర్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌



మాట్లాడుతున్న సీనియర్‌ సైంటిస్ట్‌ చంద్రశేఖర్‌

తెయూ(డిచ్‌పల్లి): దేశ సుస్థిరాభివృద్ధికి ప్రధాన పునరుత్పాదక వనరులైన సౌరశక్తి, పవనశక్తి, జలశక్తులను కాపాడుకోవాలని నాగపూర్‌ డీఆర్‌డీవో సీనియర్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌ పేర్కొన్నారు. తెయూలో శుక్రవారం తెలంగాణ కౌన్సిల్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ ఆధ్వర్యంలో డాక్టర్‌ ఎం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జాతీయ సైన్స్‌ డే నిర్వహించారు.

ఈ సందర్భంగా భారత రక్షణ శాఖ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) సీనియర్‌ సైంటిస్ట్‌ చంద్రశేఖర్‌ 'సుస్థిరాభివృద్ధి–పునరుత్పాదక వనరుల పాత్ర' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. పునరుత్పాదక వనరులను కాపాడుకోవాలని లేదంటే ప్రకృతికి హానిచేసే మానవ ఉద్గారాలైన క్లోరో ఫ్లోరో కార్బన్స్‌తో ఓజోన్‌ పొర దెబ్బతింటుదన్నారు. తద్వారా అతినీలలోహిత కాంతి కిరణాలు భూమికి చేరి మానవులు క్యాన్సర్‌ లాంటి వ్యాధులకు గురయ్యే అవకాశాలుంటాయన్నారు. తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి మాట్లాడుతూ.. మానవ మనుగడకు శాస్త్ర సాంకేతిక రంగంలో జరిగే నూతన వినూత్న ప్రయోగాలే దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అపర్ణ, టీజీ కాస్ట్‌ నోడల్‌ ఆఫీసర్‌ వాసం చంద్రశేఖర్‌, బయోటెక్నాలజీ హెచ్‌వోడీ ప్రసన్నశీల, పీఆర్‌వో పున్నయ్య, అధ్యాపకులు శరత్‌, నాగేంద్రబాబు, రామేశ్వర్‌ రెడ్డి, నర్సయ్య, రమ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



రుద్రూర్‌: తప్పిపోయి రుద్రూర్‌ చేరుకున్న బాలుడిని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై సాయన్న శుక్రవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్‌ మండలం నీలా క్యాంప్‌ పేపర్‌మిల్‌కు చెందిన యశ్వంత్‌ అనే పదేళ్ల బాలుడు దారి తప్పి గురువారం రాత్రి రుద్రూర్‌ చేరుకున్నాడు. 100 డయల్‌ ద్వారా బాలుడిని పీఎస్‌కు తరలించి వివరాలు సేకరించారు. అనంతరం బాలుడి తల్లి చిన్నమ్మకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెయూలో ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌



ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులతో హెటిరో డ్రగ్స్‌ కంపెనీ ప్రతినిధులు, తెయూ అధికారులు

- 35 మంది విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హెటిరో డ్రగ్స్‌ కంపెనీ వారు శుక్రవారం నిర్వహించిన క్యాంపస్‌ ప్లేస్‌మెంట్‌(జాబ్‌మేళా)లో 35 మంది విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమని రిజిస్ట్రార్‌ యాదగిరి పేర్కొన్నారు. 2022–23, 2024 విద్యాసంవత్సరాలకు సంబంధించిన విద్యార్థులకు ఈ జాబ్‌మేళా నిర్వహించారు. తెయూతో పాటు కాకతీయ, ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్‌, మహారాష్ట్ర, కేరళ యూనివర్సిటీలకు చెందిన 125 మందికి పైగా విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. హెటిరో డ్రగ్స్‌ కంపెనీ (హైదరాబాద్‌) ప్రతినిధులు దుర్గాప్రసాద్‌, రంగారెడ్డిల నేతృత్వంలో విద్యార్థులకు రాతపరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన 35 మంది విద్యార్థులకు తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి, ప్లేస్‌మెంట్‌ డైరెక్టర్‌ పాత నాగరాజు చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. భవిష్యత్‌లో వంద శాతం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మరిన్ని కంపెనీలను సంప్రదించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని రిజిస్ట్రార్‌ తెలిపారు. జాబ్‌మేళాను తెయూ కెమిస్ట్రీ విభాగాధిపతి నాగరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, అధ్యాపకులు బి సాయిలు, బాలకిషన్‌, నాగేశ్వరరావు, రాజేశ్వరి, గంగా కిషన్‌, డేనియల్‌, సురేష్‌, నాగేంద్రబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్‌ కాలేజీలో జాబ్‌మేళా



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు

నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని గిరిరాజ్‌ కాలేజీలో శుక్రవారం హెచ్‌సీఎల్‌ టెక్‌బీ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తమ కళాశాల ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. డీఐఈవో రవికుమార్‌ మాట్లాడుతూ ఇంటర్‌ అర్హతతో ఇలాంటి కంపెనీలో ఉపాధి కల్పిస్తున్న గిరిరాజ్‌ కళాశాల ప్రతినిధులను అభినందించారు. జాబ్‌మేళాలో విద్యార్థులు ఎం శరణ్య, వై శివరాజ్‌, బి రుషిత, జి అంజలి, నిన్వేష్‌ ఎంపికయ్యారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ రఫీక్‌, టెక్‌బీ ప్రతినిధి రాజేష్‌, టీఎస్‌కేసీ మెంటర్‌ శ్రీకాంత్‌, అధ్యాపకులు రాజేష్‌, రామస్వామి, రాహుల్‌ పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్‌

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ అన్నారు. కలెక్టర్‌ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం, కాంప్లెక్స్‌ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. మెరుగైన విద్యాబోధనకు అమలుచేస్తున్న వివిధ పద్ధతులు, పథకాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, విద్యార్థుల ప్రగతిని నమోదు చేయాలన్నారు. టీచర్లు గైర్హాజరును తగ్గించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి పాఠశాలలో మొక్కలు నాటాలన్నారు. టీచర్ల కొరత ఉన్నచోట ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలాల వారిగా విద్యాబోధనకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పరీక్షల విభాగం అధికారి విజయభాస్కర్‌, హెచ్‌ఎంలు, కాంప్లెక్స్‌ ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్‌: ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి–ముత్తకుంట మార్గంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్నాపల్లి–ముత్తకుంట మార్గంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనగా కుర్నాపల్లికి చెందిన నరేశ్‌, నగేశ్‌లకు గాయాలయ్యాయి. చికిత్స కోసం వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

పేకాట స్థావరాలపై దాడి

ఖలీల్‌వాడి/ మోర్తాడ్‌: జిల్లా కేంద్రంలోని ఆరో టౌన్‌ పీఎస్‌ పరిధిలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.1,15 లక్షల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మోర్తాడ్‌ మండలం సుంకెట్‌లో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. పక్కా సమాచారంతో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడిచేసి రూ.12,170 నగదును స్వాధీనం చేసుకున్నమని వివరించారు.

క్రైం కార్నర్‌

ప్రేమ జంట అఘాయిత్యం

- యువకుడి ఆత్మహత్య, యువతి ఆత్మహత్యాయత్నం



బోధన్‌: ప్రేమ విఫలమైన ఓ జంట అఘాయిత్యానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఎడపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి తెలిపిన ప్రకారం.. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మోరె దీపక్‌(20) తన ప్రేమ విఫలమైందని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి తల్లి లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీపక్‌కు ప్రేమించిన అమ్మాయి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది.

హత్య కేసులో నిందితుల రిమాండ్‌



కామారెడ్డి క్రైం: భూతగాదాలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌ కాలనీలో జరిగిన వ్యాపారి విశ్వనాథం హత్య కేసులో నిందితులను శుక్రవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విశ్వనాథం(64) గుడికి వెళ్లి వస్తుండగా అతనితో కొద్దిరోజులుగా గొడవలు ఉన్న లక్ష్మీబాయి, ఆమె అల్లుడు రాజశేఖర్‌, పోచయ్య, జంగం శంకరప్పలు దాడి చేయగా తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో నలుగురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: అధికారుల విధులకు ఆటంకం కలిగించిన మహమ్మద్‌ మునావర్‌, మహ్మద్‌ అఖ్లాక్‌ అహ్మద్‌లకు వేర్వేరు కేసుల్లో జైలుశిక్షను విధించినట్లు నిజామాబాద్‌ రెండో అదనపు జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ పాముజుల శ్రీనివాస్‌రావు శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లోని తెలంగాణ సూపర్‌ మార్కెట్‌ పురాని హావేలి దగ్గర పోలీస్‌ కానిస్టేబుల్‌ సయ్యద్‌ హమీద్‌ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆ ప్రాంతంలోని పరిస్థితులపై ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. ఇది గమనించిన ఆటోనగర్‌కు చెందిన మహ్మద్‌ మునావర్‌ 2018నవంబర్‌14న ఉదయం కానిస్టేబుల్‌తో 'నీవు ఇక్కడ ఏం చేస్తున్నావు, చాలా రోజుల నుంచి నిన్ను గమనిస్తున్నా.. ఇక్కడ ఏదైనా ఇన్ఫర్మేషన్‌ కావాలంటే నన్ను కలవాలి. నేను ఇక్కడ సొసైటీకి ప్రెసిడెంట్‌ని అంటూ కానిస్టేబుల్‌ సయ్యద్‌ హమీద్‌పై చేతులు వేసి నూకేశాడు. ఈ అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు కావడంతో మునావర్‌కు ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.2వేల జరిమానా, జరిమానా చెల్లించకుంటే అదనంగా రెండు వారాలు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

అర్సపల్లి శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడిసెలు వేస్తున్నారనే సమాచారం మేరకు 2018డిసెంబర్‌24న నిజామాబాద్‌ మండల కార్యాలయ రెవెన్యూ సిబ్బంది వెళ్లగా అక్కడ ఉన్న మహ్మద్‌ అఖ్లాక్‌ అహ్మద్‌ అనే వ్యక్తి రెవెన్యూ సిబ్బందిని అధికారిక విధులు నిర్వహించకుండా, విధులకు ఆటంకపరిచాడు. గ్రామ రెవెన్యూ అధికారి గాజుల చిన్ననారాయణను దూషిస్తూ కట్టెతో కొట్టి విధులు నిర్వహించకుండా ఆటంకపరిచాడనే అభియోగాలు కోర్టు నేరన్యాయ విచారణలో రుజువు కావడంతో ధర్మపురిహిల్స్‌కు చెందిన మహమ్మద్‌ అఖ్లాక్‌ అహ్మద్‌కు ఏడాది సాధారణ జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ భూసారపు రాజేశ్‌ గౌడ్‌ ప్రాసిక్యూషన్‌ నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- పోలీసుల అదుపులో భర్త..?



రాథోడ్‌ విజయ (ఫైల్‌)

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని సాయినగర్‌ కాలనీలో రాథోడ్‌ విజయ అలియాస్‌ మీనాక్షి(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, ఎస్సై మహమ్మద్‌ షరీఫ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం యాచారం గ్రామానికి చెందిన విజయకు డిచ్‌పల్లి మండలం వెస్లీనగర్‌ తండాకు చెందిన గబ్బర్‌సింగ్‌(రిటైర్డ్‌ జవాన్‌)తో 2016లో రెండవ వివాహం జరిగింది. వారికి పిల్లలు లేరు. దంపతులు ఏడాది కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం గబ్బర్‌సింగ్‌ డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సాయినగర్‌ కాలనీలో ఉన్న తన ఇంటికి వచ్చి ఉంటున్నాడు. దీంతో గురువారం(29న) రాత్రి విజయ డిచ్‌పల్లిలోని తన భర్త వద్దకు వచ్చింది. రాత్రి విజయ అనుమానస్పదరీతిలో ఉరేసుకుంది. భర్త వెంటనే ఆమెను జిల్లాలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అదేరాత్రి గబ్బర్‌సింగ్‌ డిచ్‌పల్లి ఠాణాకు వచ్చి పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం డిచ్‌పల్లి సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. విషయం తెలిసిన మృతురాలి విజయ తల్లిదండ్రులు, బంధువులు వెంటనే డిచ్‌పల్లికి చేరుకున్నారు. విజయను భర్త గబ్బర్‌సింగ్‌, అతడి కుటుంబ సభ్యులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లి సకున ఆరోపించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి కుటుంబీకులు నిందితుడి ఇంటిపై దాడికి పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు అతడి ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా కేంద్రంలో 11 నెలల బాలుడు..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణకాలనీలో ఓ బాలుడు అనునామానస్పదస్థితిలో మృతి చెందినట్లు ఐదోటౌన్‌ ఎస్సై గంగాధర్‌ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి బ్రాహ్మణ కాలనీకి చెందిన మంగ మహేశ్‌, అనురాధ దంపతులకు మంగ విఘ్నేశ్‌(11 నెలల బాలుడు) ఉన్నారు. నాలుగు రోజుల క్రితం విఘ్నేశ్‌ ఇంట్లోనే తీవ్ర జర్వంతో బాధపడుతున్నాడు. ఈ నెల 28న తల్లి మంగ అనురాధ అనారోగ్యానికి గురికావడంతో జీజీహెచ్‌లో చికిత్స తీసుకుంటోంది. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలుడు శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని భర్త చికిత్స పొందుతున్న భార్యకు ఫోన్‌ చేసి చెప్పాడు. భర్తపై అనుమానం ఉన్న భార్య అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్ప మృతిగా కేసు నమోదు చేసి, బాలుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాన్సువాడలో ప్రైవేటు ఆస్పత్రి నర్సు..




మమత (ఫైల్‌)

బాన్సువాడ: పట్టణంలోని చైతన్య కాలనీలో నివాసముంటున్న మమత (23) అనే ప్రైవేటు ఆస్పత్రి నర్సు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బీర్కూర్‌ మండలం బరంగెడ్గికి చెందిన గాండ్ల మమత పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. చైతన్య కాలనీలోని ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటోంది. మమత వాజిద్‌నగర్‌కు చెందిన ప్రశాంత్‌ ఇద్దరి ప్రేమించుకుంటున్నారు. శుక్రవారం ఆమె అద్దెకు ఉన్న గదికి ఉదయం అతను వచ్చినట్లు సమాచారం. తనను పెళ్లి చేసుకోవాలని ప్రియుడిపై మమత ఒత్తిడి తేవడంతోనే ఇద్దరి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం మమతను గది నుంచి భుజంపై వేసుకుని ప్రశాంత్‌ అనే వ్యక్తి మెట్లు దిగుతుండడంతో అక్కడే ఉన్న కొందరు ఏమైందని అడుగగా పిడుసు వచ్చిందని చెప్పి మమతను ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు చూసి అప్పటికే మమత చనిపోయినట్లు నిర్ధారించడంతో ఆస్పత్రికి తీసుకొచ్చిన యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. మమత పెళ్లి చేసుకోవాలని అన్నందుకు ప్రియుడు ప్రశాంత్‌ హత్య చేసి ఉంటాడని బాధిత కుటుంబీకులు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రైవేటు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ కృష్ణ తెలిపారు. మృతురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శుభకార్యానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

నస్రుల్లాబాద్‌: మండల కేంద్రంలోని నిజాంసాగర్‌ ప్రధాన కాలువపై ఉన్న మూల మలుపు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికిగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా విషుపురి గ్రామానికి చెందిన పాంచాల ఉష కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి ఆటోలో వెళ్తుండగా ఎదురుగుండా మేకల బొలెరో వాహనం వేగంగా వచ్చింది. మూల మలుపు వద్ద అతి వేగంతో ఉన్న ఆ వాహనం అదుపు తప్పి ఆటోను ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఉష కిందపడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రలతో దాడి చేసుకున్న యువకులు

ఖలీల్‌వాడి: కర్రలతో అల్లరిమూకలు దాడి చేసుకున్న ఘటన నగరంలోని గౌతంనగర్‌ చౌరస్తాలో చోటు చేసుకుంది. మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన మధు గ్రూప్‌ పవన్‌, గఫార్‌ గ్రూపుల మధ్య శుక్రవారం సాయంత్రం గొడవ జరిగింది. దీంతో వారు కర్రలతో మధుపై దాడి చేశారు. ఈ ఘటనలో మధు తీవ్రంగా గాయపడడంతో నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. మధు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా పవన్‌, గఫార్‌లు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

యువతిని వేధించిన యువకులు

ఖలీల్‌వాడి: ఇందల్వాయి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్‌ కళాశాలకు వచ్చిన యువతిపై అదే కళాశాలకు వచ్చే యువకుడు, ఆటో డ్రైవర్‌ వీడియో చిత్రీకరించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సదరు యువతిని ఇద్దరు యువకులు ఫాలో చేస్తూ వీడియో చిత్రీకరిస్తూ కాలేజీలోకి వెళ్లగా అక్కడే ఉన్న భజరంగ్‌ కార్యకర్త సెల్‌ ఫోన్‌ను తీసుకొని నిలదీశారు. వెంటనే అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం వీడియో తీసిన యువకుడితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఒకటో టౌన్‌ పోలీసులు కాలేజీకి యువకులను, ఆటోను పీఎస్‌కు తరలించారు. పోలీసులు పెట్టి కేసు పెట్టి వదిలేసినట్లు సమాచారం.

కౌన్సిలర్‌పై దాడి

బోధన్‌టౌన్‌: పట్టణంలోని కొత్త బస్టాండ్‌ సమీపంలోని ఓ లాడ్జీలో కొందరు వ్యక్తులు కౌన్సిరల్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని గాయాలతో ఉన్న కౌన్సిలర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పట్టణ సీఐ వీరయ్యను వివరాలు కోరగా ఇప్పటి వరకు దాడి విషయమై ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదన్నారు. కాగా కౌన్సిలర్‌పై దాడి చేస్తున్న వీడియో సోషల్‌ మీడియాలో హల్‌చల్‌గా మారింది. దీనిపై పలురకాల పుకార్లు వెల్లువెత్తుతున్నాయి.

ఆటో ఎత్తుకెళ్లిన దొంగలు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌ ప్రాంతంలో ఆటోను దొంగలు ఎత్తుకెళ్లినట్లు మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కంఠేశ్వర్‌కు చెందిన మహమ్మద్‌ ఇమ్రాన్‌ గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తన ఆటోను ఇంటి ఎదుట ఉంచి నిద్రించాడు. శుక్రవారం ఉదయం లేచి చూసే సరికి ఆటో కనిపించలేదు. పలు చోట్ల వెతికినా ఆటో ఆచూకీ దొరకలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ పేర్కొన్నారు.